క్లుప్తంగా

నగర ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు



దాబాగార్డెన్స్: నగర ప్రజలకు మాజీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. వినాయకుడిని పూజిస్తే సకల కార్యాలు సిద్ధిస్తాయని, నగర ప్రజలు భక్తిశ్రద్ధలతో ఈ వినాయక చవితిని పర్యావరణ హితంగా జరుపుకోవాలని ఆమె ఆకాంక్షించారు.

ఘనంగా భూలోకమాత నెల పండగ



పసుపు కొమ్ముల అలంకరణలో అమ్మవారు

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెం జాతీయ రహదారి పక్కనున్న భూలోకమాత అమ్మవారి నెలవారీ పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పండగ సందర్భంగా అమ్మవారిని పసుపుకొమ్ములతో విశేషంగా అలంకరించారు. తెల్లవారు జాము నుంచి గ్రామంలోని మహిళలు, కార్యవర్గ సభ్యులు, గ్రామస్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్, గాజులను సమర్పించి, భక్తితో కొలిచారు. ఈ కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మట్టి ప్రతిమల పంపిణీ



గణపతి మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న విద్యార్థిని

ఎంవీపీకాలనీ: వినాయకచవితిని పురస్కరించుకుని ఎంవీపీ కాలనీలోని శ్రీ సత్యసాయి విద్యావిహార్ విద్యార్థులు మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. 6,7 తరగతుల విద్యార్థులు 300 లకు పైగా గణేషుడి మట్టి ప్రతిమలు తయారు చేశారు. వాటిని ఎంవీపీ కాలనీలోని పలు ప్రాంతాల్లో పంపిణీ చేశారు. విద్యార్థులు స్వయంగా స్థానిక నివాసాలకు వెళ్లి ప్రతిమలు అందజేశారు. పిల్లల్లో భక్తిభావంతో పాటు సమాజంలో పర్యావరణ ప్రాముఖ్యతపై అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు స్కూల్ కన్వీనర్ ఎస్.జి.చలం తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారుడి బయోపిక్ 'అర్జున్ చక్రవర్తి'



సందడి చేసిన సినిమా యూనిట్

దాబాగార్డెన్స్: కబడ్డీ క్రీడాకారుడి జీవితంపై ఆధారపడిన వాస్తవగాథ 'అర్జున్ చక్రవర్తి' సినిమా ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర బృందం మంగళవారం నగరంలో ఓ హోటల్‌లో విలేకరులతో మాట్లాడింది. అర్జున్ చక్రవర్తి కేవలం ఒక సినిమా కాదు, ఇది నా తొమ్మిదేళ్ల కష్టం. కబడ్డీ చాంపియన్ జీవితంపై దర్శకుడు విక్రాంత్ రుద్ర ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారని హీరో విజయరామరాజు అన్నారు. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని, ఇప్పటికే మంచి స్పందన వస్తుందని అన్నారు. ఇప్పటికే ఈ సినిమా 46 అంతర్జాతీయ ఫిల్మ్ అవార్డులు గెలుచుకుందని, ఇటీవల విడుదలైన ట్రైలర్ సినిమాపై అంచనాలు పెంచిందని నిర్మాతా శ్రీని గుబ్బల అన్నారు. ఈ సినిమా ప్రేక్షకులందరికీ నచ్చుతుందని, గొప్ప థియేట్రికల్ అనుభూతిని ఇస్తుందని నటుడు దయానంద రెడ్డి (పుష్ప-2 ఫేమ్) పేర్కొన్నారు. దర్శకుడు ఈ సినిమాను అద్భుత స్థాయికి తీసుకెళ్లారని హీరోయిన్ సిజా రోజ్ అన్నారు. నటుడు దుర్గేష్ తదితరులు మాట్లాడారు.

అల్పపీడనంతో .. హైరానా

- వినాయక ఉత్సవాలకు వర్షాలతో ఆటంకం
- జోరువానలో మండపాల ఏర్పాటు
- నానిపోయిన కర్రలు, ఎగిరిపోయిన టార్పాలిన్లు
- అవస్థలు పడుతున్న ఉత్సవాల నిర్వాహకులు



వర్షం కురుస్తున్నా శ్రీకాంత్‌నగర్‌లో వినాయక మండపానికి అలంకరణ చేస్తున్న నిర్వాహకులు



లీలాసుందరినగర్‌లో వినాయక మండపం



రాజీవ్‌నగర్‌లో వినాయక మండపం

ఆరిలోవ: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో మండపాల ఏర్పాట్ల పనులు ముందుకు సాగక గణపతి ఉత్సవాల నిర్వాహకులు ఇబ్బందులకు గురయ్యారు. జోరుగా వర్షాలు కురుస్తుండడంతో ఉత్సవాల ఏర్పాట్లకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. వినాయక చవితి వస్తుందంటే సుమారు నెల రోజుల నుంచి హడివిడి కనిపిస్తుంది. పందిళ్లు వేయడం, మండపాలు అలంకరించడంలో ఉత్సవాల నిర్వాహకులు నిమగ్నమవుతుంటారు. అందర్నీ ఆకర్షించేలా మండపాలను అలంకరించాలని కష్టపడతారు. తూర్పు నియోజకవర్గంలో నెల రోజులుగా గణపతి ఉత్సవాల ఏర్పాట్లలో నిర్వాహకులు తలమునకలైన ఉన్నారు. చవితి ఉత్సవాలకు బుధవారం నాటికి మండపాలు సిద్ధం చేయాల్సి ఉంది. దాని కోసం నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తుండగా సోమవారం రాత్రి నుంచి ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తుండంతో మండపాల ఏర్పాట్లలో ఇబ్బందులు ఏర్పడ్డాయి. మంగళవారం కూడా వర్షం జోరుగా కురవడంతో పనులు నిలిపివేయవలసి వచ్చింది. మండపాలు కోసం వేసిన పందిళ్లు నానిపోయాయి. బలంగా వీస్తున్న గాలులకు టార్పాలిన్లు ఎగిరిపోయాయి. మండలపాల అలంకరణ పనులను సైతం నిలిపివేయవలసి వచ్చింది. కొన్ని చోట్ల రంగులతో అలంకరించిన మండపాలు కళ తప్పాయి. బుధవారం వర్షం లేకపోతే వినాయక చవితి పూజా కార్యక్రమాలు ముగిసిన తర్వాత అయినా మండపాలను అలంకరించుకోవచ్చంటూ కొందరు నిర్వాహకులు నిర్ణయించుకున్నారు. నియోజకవర్గంలో ఆరిలోవ, పైనాపిల్‌కాలనీ, శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, బాలాజీనగర్, చినగదిలి నుంచి హనుమంతవాక వరకు కొండవాలు ప్రాంతాలు, విశాలాక్షినగర్, ఎంవీపీ కాలనీ, అప్పూఘర్, జాలరిపేట, పెదవాల్తేరు, చినవాల్తేరు, వెంకోజీపాలెం, ఇసుకతోట, మద్దిలపాలెం తదితర ప్రాంతాల్లో 300కు పైగా వినాయక మండపాలు ఏర్పాటు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఆయా మండపాల ఏర్పాట్లకు వర్షం ఆటంకంగా మారింది. మండపాల ముందు విద్యుత్ దీపాలు అలంకరణ కూడా సరిగా చేయలేకపోయారు. వర్షం దెబ్బకు వినాయక చవితి సందడి లేకుండా పోయిందంటూ నిర్వాహకులు వాపోయారు.

చిరు వ్యాపారాలు వెలవెల..

వర్షం కారణంగా చిరు వ్యాపారాలు వెలవెలబోయాయి. వినియోగదార్లు లేక దుకాణాలు బోసిపోయాయి. మద్దిలపాలెం, ఎంవీపీ కాలనీ, ఆరిలోవ, పెదవాల్తేరు, ఇసుకతోట, హెచ్‌బీకాలనీ తదితర ప్రాంతాల్లో ఎక్కడ చూసినా చిరు వ్యాపారులు రోడ్డు పక్కన తోపుడు బళ్లపై పెట్టి వినాయక ప్రతిమలు, పూజా పత్రి, మొక్క జొన్న పొత్తులు, జామ కాయలు, వెలగ కాయలు తదితర వాటితో పాటు వినాయక వ్రతానికి సంబంధించిన పూజా సామగ్రిని విక్రయానికి సిద్ధం చేశారు. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షం కారణంగా సామగ్రి కోసం వెళ్లే వినియోగదారుల రద్దీ తగ్గిపోయింది. దీంతో ఆయా దుకాణాలు వెలవెలబోయాయి. చవితికి లాభాలు వస్తాయనుకుంటే పెట్టుబడి కూడా వస్తుందో లేదో అంటూ చిరు వ్యాపారులు లబోదిబోమంటున్నారు.

ఆకాశాన్నంటిన పూల ధరలు

వినాయక చవితి సందర్భంగా పూలు, టెంకాయల ధరలు పెరిగిపోయాయి. రెండు రోజుల కిందట వరకు కిలో రూ.200 నుంచి రూ.250 వరకు ఉండే పలు రకాల పూలు ధరలు రెట్టింపయ్యాయి. రైతు బజార్లలో మంగళ, బుధవారాలలో గులాబీలు, చామంతి, బంతి పూలు కలిపి 100 గ్రాములు రూ.50, కిలో రూ.500 చొప్పున విక్రయించారు. వీటితో పాటు దాలియా పువ్వు ఒకటి రూ.10, కలువ పువ్వు ఒకటి రూ.20 చొప్పున విక్రయించారు. టెంకా సైజులను బట్టి రూ.35, రూ 40, రూ 50 చొప్పున విక్రయించారు.

కిటకిటలాడిన ఎంవీపీ రైతు బజార్

భారీగా వినాయక చవితి పూజా సామగ్రి విక్రయాలు



వినియోగదారులతో కిటకిటలాడుతున్న ఎంవీపీ రైతు బజార్



పూజ సామగ్రి కొనుగోలు చేస్తున్న మహిళలు

ఎంవీపీకాలనీ: వినాయక చవితిని పురస్కరించుకుని పూజా సామగ్రి కొనుగోలు దారులతో ఎంవీపీ రైతు బజార్ కిటకిటలాడింది. బుధవారం వినాయక చవితి కావడంతో పూజా సామగ్రి కొనేందుకు వినియోగదారులు పొటెత్తారు. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎంవీపీ రైతు బజార్‌లో వినియోగదారుల రద్దీ కొనసాగింది. ఉదయం వర్షం కారణంగా అమ్మకాలు మందకొడిగా సాగగా సాయంత్రం ఊపందుకున్నాయి. రద్దీని దృష్టిలో ఉంచుకుని రైతు బజార్ అధికారులు ఏర్పాట్లు చేయడంతో విక్రయాలు సజావుగా జరిగాయి. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా రైతులు, వ్యాపారులు భారీ ఎత్తున పూజా సామగ్రి, పండ్లు, పూలను రైతు బజార్‌లకు తరలించారు. సీతాఫలం, జామ, వెలగ, బత్తాయి, దానిమ్మ, మారేడు, అరటి పండ్లను గుట్టలుగా పోసి విక్రయించారు. వీటితో పాటు పూలు, పత్రి, గరిక, కొబ్బరి పువ్వు విక్రయాలు సైతం జోరుగా సాగాయి. రైతు బజార్‌లో పార్కింగ్ ఆవరణలో సైతం అనేక మంది పెద్ద ఎత్తున విక్రయాలు చేశారు.

శ్రావ్యంగా బెంగళూరు బ్రదర్స్ కర్ణాటక గాత్ర కచేరి



కీర్తనలను ఆలపిస్తున్న బెంగళూరు బ్రదర్స్

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ కళాభారతి వార్షిక సంగీత,నృత్య, నాటక ఉత్సవాల్లో నాలుగో రోజు మంగళవారం ప్రఖ్యాత కర్ణాటక గాత్ర విద్వాంసులు బెంగళూరు నివాసులు' బెంగళూరు బ్రదర్స్' గా పేరుగాంచిన హరిహరన్, అశోక్ సోదరుల గాత్రయుగళం రసవత్తరంగా సాగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథులు పాల్గొన్న అభిలాష్,దివ్యభిలాష్, కళాభారతి అధ్యక్షులు రాజు, కార్యదరి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, కోశాధికారి పైడా కృష్ణ ప్రసాద్, పంతుల రమ, ప్రకాష్, పిల్ల రమణమూర్తిలు జ్యోతి ప్రజ్వలన చేశారు.అనంతరం బెంగళూరు బ్రదర్స్ ఆలాపించిన కీర్తలను సంగీత ప్రియులను ఓలాలాడించాయి.

నేడు శ్రీహరి లీలా కల్పతరువు కూచిపూడి రూపకం

29 మంది నృత్య కళాకారులతో ' శ్రీ హరి లీలా కల్పతరువు' కూచిపూడి నృత్య రూపకాన్ని బుధవారం ప్రదర్శించనున్నట్టు కార్యదర్శి రాంబాబు తెలిపారు. బెంగళూరుకు చెందిన కూచిపూడి నృత్యకారులచే ఈ కార్యక్రమం జరగనుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని ఆయన తెలిపారు.

చిట్టి చేతుల్లో మట్టి గణపతి



విశాఖ వ్యాలీ స్కూల్‌లో మట్టి వినాయకుడి ప్రతిమలు తయారు చేస్తున్న విద్యార్థులు



తయారు చేసిన వినాయక ప్రతిమలతో విద్యార్థులు

ఆరిలోవ: పర్యావరణ పరిరక్షణలో భాగంగా విశాఖ వ్యాలీ పాఠశాలలో విద్యార్థులు మంగళవారం మట్టి వినాయక ప్రతిమలు తయారు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్ పర్యవేక్షణలో మంగళవారం ఇక్కడ ఆవరణలో వినాయక ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మట్టితో వివిధ ఆకారాలలో వినాయక ప్రతిమలు తయారు చేసి ఆకట్టుకొన్నారు. ఆ ప్రతిమలకు పువ్వులు, పళ్లు పెట్టి పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు విద్యార్థులను అభినందించారు. వినాయక చవితి ప్రాధాన్యత గురించి విద్యార్థులకు వివరించారు. పిల్లల్లో ఆధ్యాత్మికత పెంపొందించడంతో పాటు పర్యావరణ పట్ల అవగాహన కలిగించడానికి పట్టి ప్రతిమలు తయారు చేయించినట్టు తెలిపారు.

మహిళల భద్రతపై విద్యార్థినులకు అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ రూప



పాల్గొన్న విద్యార్థులు

మద్దిలపాలెం: మహిళలు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలని, డయల్ 100కు కాల్ చేస్తే నిముషాల వ్యవధిలోనే సహాయం అందుతుందని ఎస్ఐ యు.రూప తెలిపారు.మద్దిలపాలెంలో ఓ ప్రైవేట్ కళాశాలలో విద్యార్థినులకు విశాఖ సిటీ మహిళా పోలీసు స్టేషన్ ఆధ్వర్యంలో మహిళల భద్రతపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సదస్సులో రూప మాట్లాడుతూ మహిళల భద్రత కోసం అనేక చట్టాలున్నాయన్నారు. మహిళలు ఒంటరిగా కాకుండా కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాలని, తమ చుట్టూ ఉన్న వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే జాగ్రత్త పడాలని సూచించారు. స్మార్ట్ ఫోన్ల వినియోగంలో జాగ్రత్తలు అవసరమన్నారు. ఫేస్ బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగామ్, యూట్యూబ్ తదితర సామాజిక మాధ్యమాల విషయంలో కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న విశ్రాంత ఆదాయపు పన్ను కమిషనర్ వడ్డాది అప్పలరాజు మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో విలువైందని చెప్పారు. సెల్‌ఫోన్లను విజ్ఞానం పెంచుకునేందుకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో చదివిస్తున్నారని, వారి ఆశలను వమ్ము చేయవద్దని సూచించారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శిగా బొండా శ్రీనివాసరావు



ఆరిలోవ: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో పార్టీ జిల్లా కార్యదర్శి(యాక్టివిటీ)గా బొండా శ్రీనివాసరావును నియమించినట్టు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బొండా శ్రీనివాసరావు తూర్పు నియోజకవర్గంలో పదో వార్డు పరిధి ఆదర్శనగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు. ఈ సందర్భంగా పార్టీ అధిష్టానానికి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని ఆయన చెప్పారు.

రైలు ఫుట్‌గార్డు తగిలి వ్యక్తి మృతి



అప్పలనాయుడు మృతదేహం

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ సమీపంలోని తలారివానిపాలెం ఎదురుగా రైల్వే ట్రాక్‌పై ఇంజినీరింగ్ నిర్వహణ పనులు నిర్వహిస్తుండగా రైలు ఫుట్‌గార్డు తగిలి కాంట్రాక్ట్ కార్మికుడు మృతిచెందాడు. దువ్వాడ జీఆర్‌పీ సిబ్బంది తెలిపిన వివరాలు.. దువ్వాడ రైల్వేస్టేషన్‌కు సమీపంలోని తలారివానిపాలెం ఎదురుగా సోమవారం ట్రాక్ పనులు చేస్తుండగా రైలు వెళ్తున్న క్రమంలో ఢీకొంది. ఈ సంఘటనలో అక్కడ పనులు నిర్వహిస్తున్న కొత్తవలస మండలం దేవాడ ప్రాంతానికి చెందిన కోన అప్పలనాయుడు (57)కు ఫుట్ గార్డు తగిలింది. వెంటనే సిబ్బంది అగనంపూడి ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. తలకు బలమైన గాయం కావడంతో చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాణేల అలంకరణలో రాస పోలమాంబ



నాణేలు, గజమాలల అలంకరణలో రాస పోలమాంబ

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస గ్రామ దేవత రాస పోలమాంబ అమ్మవారిని 119వ అలంకరణలో భాగంగా మంగళవారం 1, 2, 5, 10, 20 రూపాయల నాణేలు, మందారమాల, గజమాలలతో అలంకరించారు. ఈ అలంకరణకు శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేటకు చెందిన కొలుసు అప్పలరాజు, రోహిణి సహకారం అందించారు.

బుల్లయ్య కళాశాలలో రక్తదాన శిబిరం



బుల్లయ్య కళాశాలలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

సీతంపేట: స్థానిక లంకపల్లి బుల్లయ్య కళాశాలలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రౌండ్ టేబుల్ ఇండియా, లేడీస్ సర్కిల్ ఇండియా, రోటరీ బ్లడ్ బ్యాంక్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి అద్భుతమైన స్పందన లభించింది. ఎడతెరిపిలేని వర్షం కురుస్తున్నప్పటికీ, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ క్యాడెట్లు, అధ్యాపకులు, సిబ్బంది ఎంతో ఉత్సాహంగా రక్తదానం చేశారు. ఈ శిబిరంలో సుమారు 400 యూనిట్ల రక్తం సేకరించారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో రౌండ్ టేబుల్ ఇండియా, లేడీస్ సర్కిల్ ఇండియా, రోటరీ బ్లడ్ బ్యాంక్ సభ్యులు చురుగ్గా పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాళ్లు, వైస్ ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది ఈ శిబిరంలో భాగమయ్యారు.

ఎన్‌సీసీలో ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినుల ప్రతిభ

అల్లిపురం: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థినులు బి.లావణ్య, ఎం.దివ్య సికింద్రాబాద్‌లో ఈనెల 10 నుంచి 24వ తేదీ వరకు జరిగిన ఆర్మీ అటాచ్‌మెంట్ క్యాంపులో ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపులో క్యాడెట్లు ఆయుధాల వినియోగం, మిలిటరీ ఆచార వ్యవహారాలు, డ్రిల్, ఫిజికల్ ఫిట్‌నెస్ వంటి అంశాలలో శిక్షణ పొందినట్లు తెలిపారు. ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ కె. గీతాంజలితో కలిసిన విద్యార్థినులను అభినందించారు.

మెరైన్ సైన్సెస్‌పై వర్క్ షాపు



మాట్లాడుతున్న జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ లక్ష్మణరావు

మహారాణిపేట: మెరైన్ సెన్సెస్ 2025 వర్క్‌షాప్ మంగళవారం ఫిషింగ్ హార్బర్ దగ్గరున్న సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీఎంఎఫ్ఆర్ఐ) కార్యాలయంలో డాక్టర్ జోయి కిజకుద్దీన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో సర్వే విధి విధానాలు, తీరప్రాంత మత్స్యకార గ్రామాలు, ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలు, మౌలిక సదుపాయలు, వసతులు, బోట్లు, వలలపై ఎన్యూమరేటర్స్ సహాయంతో సర్వే నిర్వహించి గణాంకాలు తయారు చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జేడీ లక్ష్మణరావు మెరైన్ సైన్సెస్ గురించి వివరించారు. కోనసీమ జేడీ శ్రీనివాసరావు, శ్రీకాకుళం డీడీ సత్యనారాయణ, అనకాపల్లి, విజయనగరం డీడీలు విజయ, విజయకృష్ణతో పాటు 12 జిల్లాల అధికారులు, సీఎంఎఫ్ఆర్ఐ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మణి, డాక్టర్ ముక్తా తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చిత్రలేఖన పోటీలు



పోటీలో పాల్గొన్న చిన్నారి



దేవుని రూపాన్ని వేస్తున్న చిన్నారి

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురంలో వినాయకచవితి సందర్భంగా ప్రముఖ చిత్రకారుడు,సామాజిక సేవా కార్యకర్త చెల్లూరి భాస్కరరావు ఆధ్వర్యంలో మంగళవారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పలు ప్రాంతాలకు చెందిన చిన్నారులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని చక్కటి ప్రతిభ కనబరిచారు. విజేతలకు చెల్లూరి భాస్కరరావు బహుమతులు అందించారు.

మతి స్థిమితం లేని మహిళ ఆస్పత్రికి తరలింపు

గోపాలపట్నం: మతి స్థిమితం లేని మహిళను పోలీసులు ఛారిటీ సంస్థ ప్రతినిధుల ద్వారా మానసిక ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గోపాలపట్నం పోలీస్ స్టేషన్ పరిధి సింహాచలం పాతగోశాల ప్రాంతంలో దుస్తులు లేకుండా మతిస్థిమితం లేని మహిళ తిరుగుతోందన్న సమాచారం అందడంతో సీఐ ఎస్‌పీ ప్రభాకర్ వెంకటనే స్పందించారు. మహిళా కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్‌ను పంపించారు. వీరు ఆ మహిళను గుర్తించి దుస్తులు వేయించారు. అనంతరం మమత చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి మమత సహకారంతో చినవాల్తేర్ మెంటల్ కేర్ ఆస్పత్రిలో చేర్పించారు. ఇది చూసిన స్థానికులు పోలీసులు స్పందించిన తీరును అభినందించారు.